
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 24 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 32.154 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 92.175 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు
24 క్యారెట్లు (10 గ్రాములు) -రూ.60,230
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -రూ.5,409
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,571
నవర (8 గ్రా) - రూ.44,568

గరిష్టం/కనిష్టం
34.3 /29.7

వాతావరణం
శుక్రవారం గాలిలో తేమ 61 శాతం ఉంది. శనివారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయని, వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి సుజాతకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): స్థానిక కరెంటాఫీస్ సెంటర్ వద్ద ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి వి.సుజాత, జిల్లా జడ్జి సి.యామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి జిల్లా దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారి జె.శ్రీనివాస్‌రావు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు రఘురామమూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు గూడంశెట్టి దొరబాబు, మల్లు రామమోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు, వేదాశీర్వనాలు అందించారు.

ఏడీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ బదిలీ



నెల్లూరు(అర్బన్): జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. శుక్రవారం వెంటనే ఆయన రిలీవ్ అయ్యారు. ఈయన జిల్లా టీబీ నియంత్రణాధికారిగా, కుష్టు నియంత్రణాధికారిగా కూడా పనిచేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ ప్రభుత్వం నియమించలేదు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. 1వ యూనిట్‌లో 380 మెగావాట్లు, 2వ యూనిట్‌లో 340 మెగావాట్లు, 3వ యూనిట్‌లో 450 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు తెలిపారు.

డీఎస్సీ 98, 2008 అభ్యర్థులకు పోస్టింగ్‌లు

నెల్లూరు(టౌన్): డీఎస్సీ-98, డీఎస్సీ-2008 అభ్యర్థులకు మినిమమ్ టైమ్ స్కేల్ పద్ధతిన కౌన్సెలింగ్ నిర్వహించి వివిధ పాఠశాలల్లో పోస్టులు కల్పించారు. గురువారం అర్ధరాత్రి 2 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 2008 డీఎస్సీకి సంబంధించి 36 మందికి 36 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. డీఎస్సీ 98కి సంబంధించి 239 మందికి గాను 224 మంది హాజరయ్యారు. వీరికి ఆయా పాఠశాలల్లో పోస్టులు కల్పించారు. మిగిలిన 15 మంది కూడా రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వీరికి 11 నెలలపాటు వేతనం ఇవ్వనున్నారు.

పది సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలదే పైచేయి

నెల్లూరు(టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. శుక్రవారం పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్షలు ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 4,244 మంది బాలురు, 3082 మంది బాలికలు కలిపి మొత్తం 7,326 మంది విద్యార్థులు హాజరుకాగా 2,484 మంది బాలురు, 2,119 మంది బాలికలు కలిపి మొత్తం 4,603 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 58.53 శాతం, బాలికలు 68.75 శాతం ఉత్తీర్ణత సాధించారు. నెల్లూరు జిల్లా 62.83 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 13వ స్థానంలో నిలిచింది. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కమ్ సప్లై ఆఫ్ ఆన్సర్ స్క్రిప్ట్ కోసం ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.500, రీ వెరిఫికేషన్ కమ్ సప్లై ఆన్సర్ స్క్రిప్ట్ కోసం ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.1000 ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

గ్రామాల్లో ఉపాధి కళ



- ఉపాధి హామీ పథకం పనులతో పల్లెల అభివృద్ధి
- వలసల నివారణే లక్ష్యంగా అమలు
- కనీస వేతనాలు అందించి అండగా నిలిచిన ప్రభుత్వం
- సీసీ రోడ్లు, డ్రెయిన్లు, భవన నిర్మాణాలు
- ఉద్యాన తోటల పెంపకం ద్వారా రైతులకు అండ
- పచ్చదనం కోసం లక్షలాది మొక్కల పెంపకం

గతంలో గ్రామాల్లో పనులు లేక వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలస వెళ్లేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పనులు లభిస్తున్నాయి. జాబ్‌కార్డులు కలిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నారు. తద్వారా వలసలు తగ్గాయి. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు వారు చేసిన పనులకు సంబంధించిన వేతనాలను ప్రభుత్వం వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తుండడంతో ఆర్థిక పరిపుష్టి చేకూరుతోంది. అలాగే ఈ పథకంలో భాగంగా చేపడుతున్న పనులతో పల్లెలు అభివృద్ధి బాట పట్టాయి.



సంగం మండలం అన్నారెడ్డిపాళెంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

జిల్లాలో గత నాలుగేళ్లలో కూలీలకు కల్పించిన పనిదినాలు	కూలీలకు అందించిన వేతనాలు	సీసీ రోడ్లు, డ్రెయిన్లు, భవన నిర్మాణాలకు వినియోగించిన నిధులు	పండ్ల తోటల పెంపకం	రోడ్లకిరువైపులా నాటిన మొక్కలు	వైఎస్సార్ జలకళ ద్వారా వేసిన బోర్లు
429.84 లక్షలు	రూ.1,300 కోట్లు	రూ.862 కోట్లు	5,889 ఎకరాల్లో..	11.23 లక్షలు	1,559

నెల్లూరు(పొగతోట): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (మట్టి పనులు) ద్వారా గ్రామాలు అభివృద్ధి చెంది వాటి రూపురేఖలు మారుతున్నాయి. వలసల నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2007లో ఈ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోంది. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, భవన నిర్మాణాలు చేపడుతున్నారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. తద్వారా ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా ఏర్పడుతోంది. అంతేకాక ఉపాధి కూలీల కొనుగోలు సామర్థ్యం కూడా పెరిగింది. వ్యాపార లావాదేవీలు పెరిగాయి.



ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావ్ (ఫైల్)

కనీస వేతనం
జిల్లాలో 38 మండలాలు ఉండగా 37 మండలాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. పనుల అనంతరం కూలీలు ఇంటికి వెళ్లి భోజనం చేసి మధ్యాహ్నం నుంచి మరొక పనికి వెళుతున్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు రోజుకు కనీసం రూ.250 వేతనం అందుతోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఇతర పనులకు వెళ్లడం ద్వారా కూలీలు అదనపు ఆదాయం కూడా పొందుతున్నారు. భార్య, భర్త ఇద్దరూ పనులకు వెళితే రూ.1000 వరకు సంపాదిస్తున్నారు.

వ్యవసాయ రంగం అభివృద్ధి
ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంట కాలువలు తీయడం, పూడికతీత, కుంటలు, చెరువుల్లో మట్టి తీయడం, పంట పొలాలకు రోడ్లు వేయడం, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులు చేపడుతున్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను పంచాయతీ అనుమతి తీసుకుని ఉపాధి హామీ పనుల ద్వారా పూర్తి చేసుకుంటున్నారు.

మొక్కల పెంపకం
ఉపాధి హామీ నిధుల ద్వారా రోడ్లకిరువైపులా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందిస్తున్నారు. గడచిన నాలుగేళ్లల్లో 2,802 కి.మీ. పొడవున రోడ్లకిరువైపులా రూ.16.14 కోట్ల వ్యయంతో 11.24 లక్షల మొక్కలు నాటారు. అలాగే చిన్న, సన్నకారు రైతుల భూముల్లో ఉపాధి నిధులతో పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు. గుంత తీసి మొక్క నాటినప్పటి నుంచి మూడేళ్ల వరకు వాటి సంరక్షణ కోసం నిధులు కేటాయిస్తున్నారు. మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, జామ, మునగ తదితర తోటల పెంపకం చేపడుతున్నారు. గత నాలుగేళ్లలో రూ.10.75 కోట్ల వ్యయంతో 5,889 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు.

బోర్లతో జలకళ
ఉపాధి హామీ పథకం ద్వారా వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా పైసా ఖర్చు లేకుండా అర్హులైన చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేస్తున్నారు. బీడు భూముల్లో బోర్లు వేయడం ద్వారా పొలాలు సాగులోకి వస్తున్నాయి. 2020 నుంచి ఇప్పటి వరకు రూ.13.83 కోట్ల వ్యయంతో 1,559 మంది రైతుల పొలాల్లో బోర్లు వేశారు.

1.13 కోట్ల పనిదినాలు లక్ష్యం



ఉపాధి హామీ పథకం వలసల నివారణకు, ప్రజలకు పనులు కల్పించేందుకు, గ్రామాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన పథకం. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా పనులు గుర్తించి వాటిని ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టి పూర్తి చేస్తున్నాం. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర భవన నిర్మాణాలు చేపడుతున్నాం. అడిగిన వారికి లేదనకుండా పనులు కల్పిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.13 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు.
– వెంకట్రావ్, డ్వామా పీడీ

పనులు కల్పిస్తున్నారు



గ్రామంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి పనులు చేస్తున్నాం. ఉదయం పనులకు వెళ్లి 10 గంటలకు తిరిగి ఇంటికి వస్తున్నాం. చేసిన పనులకు సంబంధించి కొలతలు తీసి వేతనాలు బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తున్నారు.
– బి.లత, అన్నారెడ్డిపాళెం, సంగం మండలం

సకాలంలో వేతనాలు



ఉదయం ఉపాధి పనులకు హాజరై ఇంటికి వచ్చి మధ్యాహ్నం సొంత పనులకు వెళుతున్నాం. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే పనులు కల్పిస్తున్నారు. గ్రామసభలు నిర్వహించి అవసరమైన పనులు గుర్తించి వాటిని ఉపాధి హామీ పథకం ద్వారా పూర్తి చేస్తున్నారు. సకాలంలో వేతనాలు అందుతున్నాయి.
– వెంకటశేషమ్మ, అన్నారెడ్డిపాళెం, సంగం మండలం

వలసల తగ్గుదల
గతంలో పనులు లభించక వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలస వెళ్లేవారు. ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చాక వలసలు తగ్గాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పుష్కలంగా పనులు లభిస్తున్నాయి. జాబ్‌కార్డులు కలిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నారు.

గౌతమ్ ఆలోచనలు ఉన్నతంగా ఉండేవి



బహిరంగ సభలో మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- అట్టహాసంగా ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ ప్రారంభం

ఆత్మకూరు: దివంగత మంత్రి, తన సోదరుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆలోచనలు ఎంతో ముందుచూపుతో ఉన్నతంగా ఉండేవని, ఆయనతో ఉండే అనుబంధంతో తాను చిన్న వయసులోనే ఈ విషయాన్ని గమనించానని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఏడీఎఫ్, ఎంజీఆర్ ఫౌండేషన్ల ద్వారా సొంత నిధులతో నిర్మించిన ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్‌ను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్ పాల్గొన్న ఈ సభలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడారు. 1995లో లండన్‌లో చదువు పూర్తి చేసుకొని దేశంలో అడుగుపెట్టిన గౌతమ్‌రెడ్డి అప్పట్లో మాల్ లాంటివి లేకపోవడంతో అది ఏర్పాటు చేసే ఆలోచన చేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికై సరిగ్గా ఈ రోజుతో ఏడాది పూర్తయిందని, ఇచ్చిన మాట మేరకు తొలి కానుకగా మున్సిపల్ బస్టాండ్‌ను ప్రజలకు అంకితం చేస్తున్నానని తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పలు వినతులు అందాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఏడీఎఫ్ ద్వారా రూ.10 కోట్ల సొంత నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు నుడా పరిధిలో చేరడం సంతోషకరమని, పేదలకు మరో 15 వేల ఇళ్లు నిర్మించేందుకు అవకాశం కలిగిందని తెలిపారు. ఇప్పటికే రెండు జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించగా, శనివారం మరో 1,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా 23 కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో మరో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. నారంపేట వద్ద ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కులో ఆరు నెలల్లో ఓ పరిశ్రమ ఏర్పాటు కానుందని, అక్కడ 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమలు తీసుకురానున్నట్లు తెలిపారు. రానున్న మూడేళ్లలో సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తద్వారా ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని మెట్ట మండలాలకు సాగు, తాగునీరు లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో రెండు జాతీయ రహదారులు ఉండగా, మరో జాతీయ రహదారి రానుందన్నారు. వేర్‌హౌసింగ్, లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని త్వరలోనే ఆ పనులు వేగవంతమయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పు చేయం.. తలవంపులు తీసుకురాం
- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు: గత 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నామని, తమ కుటుంబీకులు తప్పు చేయబోరని, ప్రజలకు తలవంపులు తీసుకురామని నెల్లూరు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరులో ఎంజీఆర్ బస్టాండ్ ప్రారంభోత్సవం అనంతరం బహిరంగసభలో ఆయన మాట్లాడారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు వినియోగించుకున్న కాంగ్రెస్ పార్టీ అనంతరం చెప్పుడు మాటలతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఇబ్బందులకు గురిచేయడంతో ఎంపీ పదవికి సైతం రాజీనామా చేసి ఆ కుటుంబం వెంట నడిచామన్నారు.ఆత్మకూరు ప్రాంతానికి తమ కుటుంబం తరఫున చిరుకానుకగా ఈ బస్టాండ్‌ను సొంత నిధులతో నిర్మించిఅందజేసినట్లు తెలిపారు. దివంగత వైఎస్సార్ వల్లనే వెలుగొండ ప్రాజెక్ట్, సోమశిల హైలెవల్ కెనాల్ రూపురేఖలు దాల్చాయని, వాటిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా త్వరలోనే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సీఎం ఆశీర్వాదంతో తన సోదరుడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఉదయగిరి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు. 600 వాగ్దానాలిచ్చి, వాటిని తుంగలో తొక్కి, మళ్లీ కొత్త మేనిఫెస్టోతో వస్తున్న చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మబోరన్నారు. తండ్రీ, కొడుకులు, దత్తపుత్రుడు అబద్ధాలు చెబుతూ ప్రజలను నమ్మించేందుకు పాదయాత్ర,బస్సుయాత్ర చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వీరికితోడు పచ్చపత్రికలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి సతీమణి కీర్తిరెడ్డి, కుమార్తె అనన్య, కుమారుడు అర్జున్, తల్లి మణిమంజరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి

'జగనన్న సురక్ష' ప్రారంభం
- 'వర్చువల్'గా ఆరంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జూలై 1వ తేదీ నుంచి నెల రోజులపాటు నిర్వహించే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణం నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రారంభోత్సవ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపట్టనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం అమలుకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక, ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో జారీ చేయనున్న 11 రకాల సర్టిఫికెట్లను అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. అనంతరం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

మత్స్యకారులను భయపెట్టేలా..



కావలి నియోజకవర్గంలో సముద్ర తీరం

- ఫిషింగ్ హార్బర్‌తో సముద్రం చొచ్చుకొస్తుందంటూ 'ఈనాడు'లో కథనం
- మండిపడుతున్న అధికారులు, నిపుణులు

కావలి/బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ కారణంగా తాటిచెట్లపాళెం, బంగారుపాళెం, పాతపాళెం సమీపంలో సముద్రం ముందుకు చొచ్చుకువస్తుందంటూ 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనంపై అధికారులు, నిపుణులు మండిపడుతున్నారు. అవగాహన లేని రాతలు, అభివృద్ధిపై బురదజల్లేలా అసత్య కథనాలతో మత్స్యకారుల్లో భయాందోళనలు రేకెత్తించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సముద్రం ముందుకు చొచ్చుకురావడానికి గ్లోబల్ వార్మింగ్, సముద్ర మట్టాలు పెరగడం, తీరంలోని భౌగోళిక పరిస్థితులు, అలల ఉధృతి వంటి పలు కారణాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. 'ఈనాడు'లో మాత్రం జువ్వలదిన్నె సమీపంలోని చిప్పలేరు వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మించినప్పటి నుంచి అలలు ముందుకువస్తున్నాయని, సునామీ వంటి విపత్తులు వస్తే మత్స్యకార గ్రామాల భద్రత ఊహించుకుంటేనే ఆందోళనకరంగా ఉందని అసత్య కథనాన్ని ప్రచురించింది. ఫిషింగ్ హార్బర్‌పై మత్స్యకారుల్లో భయాందోళనలు, వ్యతిరేకతను పెంచేలా విషప్రచారానికి దిగింది.

ఫిషింగ్ హార్బర్‌ను అడ్డుపెట్టుకుని..
తీరప్రాంత గ్రామాలను ప్రగతి పథంలోకి తీసుకువెళ్లే లక్ష్యంతో చిప్పలేరు వద్ద ప్రభుత్వం శరవేగంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. అతి త్వరలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా హార్బర్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో హార్బర్‌పై బురదజల్లేందుకు ప్రతిపక్షాలు, పచ్చ పత్రికలు నానా అవస్థలు పడుతున్నాయి. అందులో భాగంగానే హార్బర్ కారణంగా సముద్రం ముందుకు చొచ్చుకువస్తుందంటూ 'ఈనాడు' నాసిరకం కథనాన్ని జనాల మీదకు వదిలింది. సముద్రంలో జరుగుతున్న మార్పుల కారణంగా అక్కడక్కడా తీరంలో సముద్రపు నీరు ముందుకు వస్తుందని, దానిని ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ముడిపెట్టడం సరికాదని మత్స్యశాఖ జేడీ ఎం.నాగేశ్వరరావు తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి కాకాణికి లలితా జ్యువెలరీ ఆహ్వానం



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో లలితా జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న లలితా జ్యువెలర్స్ షోరూమ్‌ల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా మంత్రిని ఆహ్వానించారు. ఆయన వెంట నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ఉన్నారు.

ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగులు

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాకు పదోన్నతిపై వచ్చిన ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగులు కల్పిస్తూ కలెక్టర్ ఎం హరినారాయణన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నుంచి వచ్చిన ఎస్కే మీరావలిని దగదర్తి తహసీల్దార్‌గా, ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన దుంప మంజునాథరెడ్డిని కందుకూరు తహసీల్దార్‌గా, మిడశాల హరిబాబును లింగసముద్రం తహసీల్దార్‌గా నియమించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముక్తియార్

ఉదయగిరి: మాత్రలు మింగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన దాసరపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు..దాసరపల్లికి చెందిన ముక్తియార్ ఇటీవల గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలోని బోరు మోటారు మరమ్మతులకు గురవగా బాగుచేసేందుకు వెళ్లాడు. మోటార్‌ను బయటకు తీసి చూడగా పాడవడంతో కొత్తది ఏర్పాటు చేసుకోవాలని సూచించాడు. దీంతో రైతు కేబుల్, మోటార్‌ను పొలంలోనే ఉంచాడు. మరుసటిరోజు పొలానికి వెళ్లి చూడగా కేబుల్ కనిపించకపోవడంతో ముక్తియారే చోరీ చేశాడనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ముక్తియార్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. బంధువులు, ఇతరులు తనపై దొంగతనం నేరం మోపి అవమానపరచేలా మాట్లాడడంతో ఇంట్లో ఉన్న మాత్రలు మింగి ముక్తియార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు (టౌన్): జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను నెల్లూరులోని సమగ్రశిక్ష కార్యాలయంలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల వివరాలను సమగ్రశిక్ష కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచామని చెప్పారు.

నేడు జిల్లాకు బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి రాక



కేసలి అప్పారావు

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు శనివారం జిల్లాకు రానున్నట్లు జిల్లా పౌరసంబంధాల శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బాల కార్మిక వ్యవస్థపై ఉదయం 10.30 గంటలకు నిర్వహించే జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో చైర్మన్ పాల్గొంటారని చెప్పారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం, స్వచ్ఛంద సంస్థలు, చైల్డ్‌లైన్, బాలల కోసం పనిచేసే సంస్థలు, సంఘాల ప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 155
లేయర్ (లైవ్)	: 108
బ్రాయిలర్ చికెన్	: 262
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 292
లేయర్ చికెన్	: 184

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.18
పండ్లు	: రూ.5

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..



ఘటనా స్థలంలో ప్రసన్నాంజనేయులు మృతదేహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు కొప్పోలు లక్ష్మి, కయ్యాల పిచ్చయ్య, కయ్యాల విష్ణు, కయ్యాల పవనకుమారి

- లారీని ఢీకొన్న కారు
- ఒకరి మృతి, 9 మందికి గాయాలు

మనుబోలు: తిరుమలకు దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు ముందువెళ్తున్న కంటైనర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మనుబోలు మండలం కాగితాలపూరు వద్ద శుక్రవారం వేకువజామున చోటు చేసుకుంది. క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన కయ్యాల పిచ్చయ్య, కొప్పోలు కోటేశ్వరరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన ఇన్నోవా కారులో దైవదర్శనానికి తిరుమలకు వెళ్లారు. దైవదర్శనం చేసుకుని శుక్రవారం వేకువన తిరుగు ప్రయాణమయ్యారు. కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలోకి వచ్చేసరికి హైవేకు కుడివైపున ముందు వెళుతున్న కంటైనర్‌ను డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపేందుకు ఒక్కసారిగా ఎడమవైపునకు తిప్పడంతో కారు అదుపుతప్పి వెనుకగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న కయ్యాల ప్రసన్నాంజనేయులు(23) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ గాలి రాజు, కయ్యాల పిచ్చయ్య, కయ్యాల విష్ణు, కయ్యాల పవనకుమారి, కయ్యాల సునీల్, కొప్పోలు కోటేశ్వరరావు, కొప్పోలు లక్ష్మి, కొప్పోలు సాయిమనోజ్, కొప్పోలు మేఘవర్షిత్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై ముత్యాలరావు ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మాట్లాడుతున్న పీఆర్ అదనపు కమిషనర్ సిరి

స్వామిత్వాను పటిష్టంగా అమలు చేయండి

- పీఆర్ అదనపు కమిషనర్ సిరి

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో స్వామిత్వా కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని పీఆర్ అదనపు కమిషనర్ సిరి అధికారులను ఆదేశించారు.నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం స్వామిత్వాపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కమిషనర్ మాట్లాడారు. నిబంధనల ప్రకారం భూ సర్వే నిర్వహించాలన్నారు. సర్వే సమయంలో భూముల విషయాల్లో సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఎక్కడ ఎటువంటి లోపాలకు తావు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రణాళికలు రూపొందించుకుని సర్వే నిర్వహించాలన్నారు. స్వామిత్వాపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్‌కలెక్టర్ ఆర్ కూర్మనాథ్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, మండలాల అధికారులు పాల్గొన్నారు.

పవన్ తల..బాబు కాళ్ల వద్ద తాకట్టు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- పవన్‌కు పార్టీ లేదు, గుర్తు లేదు
- దిగజారుడు మాటలు తప్ప చిత్తశుద్ధి లేదు

కోవూరు: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని, చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఆయన పనిచేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు అన్నీ ఒక్కటై సంక్షేమ ప్రభుత్వంపై రాజకీయ దాడికి ప్రయత్నిస్తున్నాయని, వారి మాయమాటలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పవన్ కల్యాణ్ తల.. చంద్రబాబు కాళ్ల దగ్గర తాకట్టు పెట్టి కాపు నాయకుల పరువును గంగలో కలిపారని విమర్శించారు. పవన్ ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను బట్టలు ఊడదీసి కొడతానని అంటున్నారని, అంత ముచ్చటగా ఉంటే మా బట్టలు మేమే విప్పుకొంటాం వచ్చి చూడాలని చమత్కరించారు. పవన్‌కు అసలు పార్టీకానీ, గుర్తు కానీ లేదన్నారు. పవన్ వాడే భాష మేమూ మాట్లాగలమని, కానీ మాకు సంస్కారం అడ్డొస్తోందన్నారు. 2019 ఎన్నికల్లో పవన్ రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసి ఓడిపోవడంతో పవన్ బట్టలు ఎప్పుడో ఊడిపోయాయన్నారు. పవన్ కారణంగా నిత్యం చిరంజీవి కుటుంబం విమర్శలు ఎదుర్కొంటుందన్నారు. చిరంజీవి ప్రజల్లో ఒక మాస్ హీరోగా సేవా కార్యక్రమాలు చేపడుతూ జీవిస్తుంటే పవన్ కల్యాణ్ దిగుజారుడు మాటలతో బతుకుతున్నారని ప్రసన్న పేర్కొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

- ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ కే సంతోషరావు

ఆత్మకూరు: విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి విద్యుత్ సంస్థకు మంచిపేరు తీసుకురావాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కే సంతోషరావు అన్నారు. ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఆత్మకూరు, ఉదయగిరి విద్యుత్ సబ్‌డివిజన్లకు చెందిన విద్యుత్ సిబ్బందితో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతులకు సర్వీసులను 30 రోజుల్లోగా మంజూరు చేయాలని, లేకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులతో స్నేహపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. వినియోగదారులకు సత్వర సేవలు అందించడంపై దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని అలసత్వం వహిస్తే చర్యలకు వెనుకాడబోమన్నారు. విద్యుత్ సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలని, వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, అలా లేని వారికి హెచ్‌ఆర్‌ఏ రద్దు చేస్తామన్నారు. విద్యుత్ పంపిణీ నష్టాలు ఎక్కువగా ఉన్న ఫీడర్లను గుర్తించి తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై సీఎండీ అసంతృప్తి వ్యక్తం చేశారు. బిల్‌స్టాఫ్ సర్వీసుల బకాయిలు సక్రమంగా వసూలు కాకపోవడంపై ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. డిస్కం పరిధిలో సుమారు వందకుపైగా విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్కో ఉపకేంద్రం నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చిస్తున్నామని వివరించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు, తీగలు సరిచేయడం కోసం రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కాగా ఆత్మకూరుకు విచ్చేసిన సీఎండీ సంతోష్‌రావుకు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు కే గురవయ్య, కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, జిల్లా సర్కిల్ ఎస్ఈ బీ వెంకట సుబ్బయ్య, డీఈఈలు జనార్దన్, శ్రీధర్, పరంధామయ్య, బెనర్జీ, అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లోని స్కాడా కార్యాలయంలో నెల్లూరు రూరల్ డివిజన్ విద్యుత్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో ప్రజలను భాగస్వాములను చేసి విద్యుత్ పొదుపు, జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు వెంటనే విద్యుత్ సర్వీసులు అందజేయాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లుల వసూలు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలన్నారు. విద్యుత్ వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800425 155333 కాల్‌చేసి సత్వరమే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజర్లు గురవయ్య, ధర్మజ్ఞాని, ఎస్ఈ వెంకటసుబ్బయ్య, ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, పరంధామయ్య, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కావలియడవల్లి ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

అనుమసముద్రంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ ఏఎస్‌పేట మండలంలో పర్యటించారు. తొలుత జువ్వలగుంటపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలించారు. రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారు..ఎంత మందిని పరీక్షిస్తున్నారు..వారికి మందులు ఇస్తున్నారా..లేదాని వైద్యురాలు జ్యోతిరాణిని అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతగానే ఉపయోగపడుతున్నాయని డాక్టర్ తెలిపారు. అనంతరం కావలియడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. నాడు-నేడు పనుల పురోగతని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలపై ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావును ఆరాతీశారు. అనంతరం చిరమన జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. వైద్యశాలలో మరుగుదొడ్లు, పారిశుధ్యాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రమణారావు, ఎంపీడీఓ భాస్కర్, హెచ్‌ఎంలు ఉన్నారు.

ఆనం టీడీపీ కోవర్టుగా పనిచేశారు

- అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ వచ్చారు
- నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి విమర్శ



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశం పార్టీకి కోవర్టుగా పనిచేశారని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆనం ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి టీడీపీ వాళ్లతో పూర్తిగా టచ్‌లో ఉంటూ వచ్చారన్నారు. ప్రభుత్వం స్థానికంగా ఏ అభివృద్ధి పనిచేయాలని భావించినా ఆనం అడ్డుపడుతూ వచ్చారన్నారు.

స్మగ్లర్లు ఎవరో తెలుసుకో లోకేశ్

లోకేశ్ పాదయాత్ర సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంలో ఏ ఒక్క వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త టీడీపీలోకి వెళ్లలేదన్నారు. లోకేశ్ వెంకటగిరిలో సభ నిర్వహించి ఈ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నారని ఆరోపించారని, కానీ లోకేశ్ పక్కన వేదికపై ఉన్న వారే స్మగ్లింగ్ చేసే వ్యక్తులని ఆయన తెలుసుకోలేక పోయారని చురకలంటించారు. నేదరుమల్లి జనార్దన్ రెడ్డి, రాజ్యలక్ష్మి హయాంలో వెంకటగిరిలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ఎవరో రాసిచ్చిన పేపర్ చదవడం కాదని, వాస్తవాలు తెలుసుకోవాలని లోకేశ్‌కు సూచించారు.

సెల్‌ఫోన్ అపహరణ

- సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తింపు

ఆత్మకూరురూరల్: నువ్వూరుపాడు సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవ పనుల్లో సచివాలయ సిబ్బంది నిమగ్నమై ఉండగా పంచాయతీ కార్యదర్శి సరిత సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. స్పందించిన సచివాలయ ఉద్యోగులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. మొబైల్ లోకేషన్ ఆధారంగా మూడు కిలోమీటర్ల దూరంలో పొలాల్లో ముళ్ల పొదల్లో ప్లాస్టిక్ కవర్‌లో దాచి ఉంచిన సెల్‌ఫోన్‌ను గుర్తించి తెచ్చి పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. శ్రమకోర్చి సెల్‌ఫోన్ ఉన్న ప్రదేశానికి చేరుకుని సెల్‌ఫోన్ తెచ్చి ఇచ్చిన సహచర ఉద్యోగులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



ముళ్లపొదల్లో దాచిన సెల్‌ఫోన్‌ను చూపుతున్న నువ్వూరుపాడు సచివాలయ ఉద్యోగులు



కొంద
రికి జిహ్వాచాపల్యం ఎక్కువ. ఏవైనా విందులు, వినోదాలు ఉంటే చాలు ఫుల్లుగా లాగించేస్తుంటారు. అయితే అలా అప్పుడప్పుడు అతిగా తినడం వల్ల శరీరంపై ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు కానీ, తరచు అతిగా తింటూ ఉంటే మాత్రం, అది మీరు బరువు పెరగటానికి, కొలెస్ట్రాల్ పెరగటానికి దారితీస్తుంది, ఫలితంగా జీర్ణక్రియ సమస్యలు మొదలుకొని రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోవడం, గుండె సంబంధ సమస్యలతో బాధపడవలసి వస్తుంది. అయితే మీరు ఎప్పుడైనా ఎక్కువగా తినేసి కడుపులో అసౌకర్యంగా భావించినపుడు ఈ చిట్కాలు పాటించండి చాలు... తక్షణ ఉపశమనం లభిస్తుంది.

ఫుల్లుగా తిన్నారా... ఆందోళన వద్దు



అమ్మమ్మల కాలం నుంచి నేటి వరకు అన్ని రకాల కడుపు సమస్యలకు ఏకైక పరిష్కారం ఏదైనా ఉంటే, అది వాము అని చెప్పవచ్చు. వాము నమలడం వల్ల కడుపులో అసౌకర్యం లేదా నొప్పి, గ్యాస్, వాంతులు, అజీర్ణం , ఆమ్లత్వం వంటి ఇతర సమస్యలను పరిష్కరించవచ్చు. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది అలాగే మంచి విరేచన కారి కావడం వల్ల అజీర్ణంతో ఇబ్బంది పడుతున్నవారు.. కొద్దిగా వాము, నల్ల ఉప్పు, అల్లం కలిపి చూర్ణం చేసి, భోజనం తర్వాత చప్పరించి గోరువెచ్చటి నీళ్లు తాగితే సరి!

పుదీనా టీ

జీర్ణ సంబంధ సమస్యలను దూరం చేయడంలో పుదీనా టీ బాగా సహాయపడుతుంది, మిరియాలు, పుదీనా కలగలిసిన టీ మీ జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తుంది. ఇది కడుపు కండరాలను సడలించే అనేక యాంటీ బాక్టీరియల్, క్రిమినాశక లక్షణాలను అందిస్తుంది. అంతేకాకుండా అతిగా తినడం వల్ల కలిగే మలబద్ధకం, విరేచనాలు ఇతర కడుపు సంబంధిత సమస్యలను నయం చేస్తుంది.

పెరుగు తినండి

మీరు కడుపులో పట్టనంతగా నిండుగా తిన్ననప్పటికీ, ఆపైన కొంచెం పెరుగు తినడం ద్వారా మేలు కలుగుతుంది. పెరుగు అనేది ప్రోబయోటిక్స్ కు మూలం కాబట్టి, ఎప్పుడైనా ఆహారం పెద్ద మొత్తంలో తిన్న తర్వాత పెరుగు తప్పకుండా తీసుకోండి. ఇది కడుపు ఉబ్బరం సహా ఇతర కడుపు బాధలను తగ్గించగలదు. తాజా సాదా పెరుగు ఎంచుకోండి.

చల్లని పాలు తాగాలి

చల్లటి పాలు తాగడం అసిడిటీని ఎదుర్కోవడానికి సులభమైన ఇంటి నివారణలలో ఒకటి. పాలలోని కాల్షియం, కడుపులోని హైడ్రోక్లోరిక్ ఆమ్లాల అదనపు స్రావాన్ని నియంత్రిస్తుంది, తద్వారా కడుపులోని ఆమ్లాలను శోషిస్తుంది. చల్లని పాలు అసిడిటీకి సరైన విరుగుడు, ఇది కడుపులో మంట నుండి తక్షణ ఉపశమనాన్ని అందిస్తుంది.

తిన్న వెంటనే నిద్ర వద్దు

బాగా తిన్న తర్వాత నేరుగా వెళ్లి హాయిగా నిద్రపోతారు కొందరు. అయితే ఇది అసలు మంచిది కాదు. దీని వల్ల యాసిడ్ రిఫ్లక్స్ జరిగి, జీర్ణక్రియ ఆటంకాలకు కారణమవుతుంది. దాంతోబాటు మనం తిన్న ఆహారం మూలంగా వచ్చి చేరే కేలరీలు కరిగే అవకాశం ఉండక బరువు పెరుగటానికి దారితీస్తుంది.

అరకిలోమీటరైనా నడవండి

నడక మీ జీర్ణక్రియను ఉత్తేజపరిచేందుకు, మీ రక్తంలో చక్కెర స్థాయిలను సమం చేయడానికి సహాయపడుతుంది. కాబట్టి కడుపు నిండా భోజనం చేసిన తర్వాత మంచం మీద పడుకునే బదులు, కాస్త నడవండి, తేలికగా అనిపిస్తుంది. కేవలం 15 నిమిషాలు చిన్న నడకకు వెళ్లి వచ్చినా చాలు మంచి అనుభూతి చెందుతారు. అయితే పరుగు, జాగింగ్ లేదా వ్యాయామాలు వద్దు. తక్కువలో తక్కువగా రెండు వందలనుంచి ఐదువందల అడుగుల దూరం నడిస్తే చాలు. .

కాబట్టి, అతిగా తిన్నప్పుడు మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి పై చిట్కాలను ప్రయత్నించండి.

లైఫ్@360

పచ్చిగా తినకండి

మనకు ఆహార పదార్థాలలో కొన్ని వండకుండా నేరుగా తినేయవచ్చు, మరికొన్నింటిని తప్పకుండా వండుకొనే తినాలి. మనలో చాలా మంది కొన్ని కూరగాయలను పచ్చిగా తినడమే ఆరోగ్యకరం అని నమ్ముతారు. అయితే అన్ని సందర్భాలలో.. అన్ని కూరగాయల విషయంలో అది మంచిది కాదంటున్నారు నిపుణులు. అలా పచ్చిగా తినకూడని కూరగాయలేమిటో తెలుసుకుందాం.

కొన్ని కూరగాయలలో సహజమైన విషపూరిత సమ్మేళనాలు, జీర్ణం కావడానికి కష్టతరమైన చక్కెరలు ఉంటాయి. ఇవి ఫుడ్ పాయిజన్, జీర్ణ సమస్యలు కలిగించడంతో పాటు గ్యాస్ట్రోనామికల్ వ్యాధులకు దారితీయవచ్చు. అంతేకాదు, కూరగాయలను పండించటానికి ఎరువులు, పురుగుమందులు ఎక్కువగా వాడుతున్నారు. మనం వాటిని ఎంత శుభ్రం చేసినా, వాటి లోపలి భాగంలో ఉండే హానికర సమ్మేళనాలు, బ్యాక్టీరియా వంటివి అలాగే ఉంటాయి. బాగా ఉడికించినపుడు మాత్రమే అవి క్రిమిసంహారం అవుతాయి, అప్పుడే అవి తినడానికి అనువైనవిగా ఉంటాయి.

అయితే పచ్చిగా అస్సలు తినకూడని ఆహార పదార్థాలు ఏమిటో కొన్నింటిని ఇక్కడ తెలుసుకుందాం.



చిలగడదుంప/గెణుసు గడ్డ/రత్నపురి గడ్డ

వీటిని నేరుగా తిన్నా, రుచిగానే ఉంటుంది. అయితే ఇలా తినడం జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. వీటిలో ఉండే పిండి పదార్థం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్‌సమస్యలు ఏర్పడతాయి. ఇలాంటి సమస్యలను నివారించడానికి వీటిని కాల్చడం లేదా ఉడికించడం మంచిది.



బీన్స్

పచ్చిగా తినకూడని మరో వెజిటెబుల్ బీన్స్. కొన్ని రకాల బీన్స్ పచ్చిగా తింటే ప్రమాదకరం కూడా. బీన్స్‌లోని కొన్ని రకాలు హానికరమైన అమైనో ఆమ్లాలను కలిగి ఉంటాయి. అందువల్ల వాటిలోని హానికరమైన టాక్సిన్‌ను తొలగించడానికి ముందు బీన్స్‌ను క్లీనర్ నీటిలో నానబెట్టండి. ఆపైన వండుకొని తినాలి.



రెడ్ కిడ్నీ బీన్స్

ఉడికించని లేదా సరిగ్గా ఉడకని కిడ్నీ బీన్స్ (రాజ్మా)లో పెద్ద మొత్తంలో టాక్సిన్, గ్లైకో ప్రొటీన్ లెక్టిన్ ఉంటుంది. వీటిని తిన్న కొన్ని గంటల్లోనే వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలకు దారితీస్తుంది. లక్షణాల తీవ్రత కూడా మీరు తిన్నపరిమాణంపై ఉంటుంది. ఎక్కువగా తినేస్తే ఎక్కువ మొత్తంలో టాక్సిన్స్ మీ శరీరంలోకి చేరతాయి. కాబట్టి కిడ్నీబీన్స్‌ని ఎప్పుడయినా ఉడకబెట్టి తినాలి.



ఆకు కూరలు

ఆకుకూరల్లో కొన్నింటిని పచ్చిగా తినకూడదు. క్యాబేజీ కుటుంబానికి చెందిన కాలీఫ్లవర్, బ్రస్సెల్స్, బ్రోకలీ, అలాగే మొలకలను పచ్చిగా తినడం వల్ల అనేక గ్యాస్ట్రోనమికల్ సమస్యలు వస్తాయి.



పుట్టగొడుగులు

పుట్టగొడుగులను పచ్చిగా తినవచ్చు, అయితే ఎక్కువ పోషకాలను పొందడానికి ఉడికించిన వాటిని తీసుకోవడం మంచిది. కాల్చిన, వేయించిన లేదా ఉడికించిన పుట్టగొడుగుల్లో ఎక్కువ పొటాషియం ఉంటుంది. అంతేకాకుండా వాటి రుచి కూడా పెరుగుతుంది. కాబట్టి వండుకొని తినండి.



శాకాహారాలు కాకుండా ఏ రకమైన మాంసాహారాన్ని అయినా పచ్చిగా తినడం చాలా ప్రమాదకరం. పచ్చి మాంసంపై రకరకాల హానికర బ్యాక్టీరియాలు ఆవాసం ఏర్పర్చుకుంటాయి. కాబట్టి మాంసాన్ని బాగా ఉడికించుకొని తినాలి. అలాగే కోడిగుడ్లను కూడా పచ్చిగా తినడం హానికరమే!

బరువు తగ్గడానికి కొందరు రకరకాల ప్రయత్నాలు చేసి విసిగి పోతుంటారు. అయితే కొన్ని రకాల జ్యూస్‌లు తాగడం వల్ల కూడా సులువుగా బరువు తగ్గవచ్చు. అవేమిటో, ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం...

బరువును జ్యూస్ చేసేయండి

గోధుమ

గడ్డి జ్యూస్ ను పొద్దున్నే కాఫీ టీ బదులుగా తాగటం వల్ల తొందరగా సన్నబడతారు. దీనికి కావాల్సిన గోధుమగడ్డిని ఇంట్లోనే ఈజీగా పెంచుకోవచ్చు. ఇందులో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ఫైటో న్యూట్రియెంట్లు,అమైనోయాసిడ్లు, విటమిన్‌లు ఎ, సి, ఇ, కె, బి కాంప్లెక్స్, క్లోరోఫిల్, ప్రోటీన్లు వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. గోధుమగడ్డి జ్యూస్‌ను తరచూ తీసుకోవడం వల్ల, శరీరంలోని విషపదార్థాలు బయటకు వెళ్లిపోయి, ఈజీగా అధిక బరువు తగ్గిస్తుంది

➡ బీట్రూట్, క్యారెట్ జ్యూస్

రోజు ఉదయాన్నే టిఫిన్ సమయంలో ఒక బీట్రూట్, రెండు క్యారెట్లు కలిపి జ్యూస్‌లా తయారు చేసుకోవాలి. ఇందులోని విటమిన్ ఏ, సి, ఫైబర్ పుష్కలంగా లభించి,అధిక బరువును తొందరగా తగ్గించడానికి ఉపయోగపడతాయి.



➡ కరివేపాకు జ్యూస్

దీనికోసం గుప్పెడు కరివేపాకు తీసుకొని, గ్లాసు నీళ్లలో వేసి మరిగించుకోవాలి. ఇందులో స్పూన్ తేనె, స్పూన్ నిమ్మరసం కలిపి తాగడం వల్ల తొందరగా అధిక బరువును తగ్గించుకోవచ్చు. కరివేపాకులో ఫోలిక్ యాసిడ్, ఐరన్ లభిస్తాయి. ఇందులోని లిపిడ్లు, అమైనో ఆమ్లాలు పొట్ట కొవ్వును తగ్గించడంలో బాగా సహాయపడతాయి.

➡ బొప్పాయి జ్యూస్...

టిఫిన్‌కి బదులుగా బొప్పాయి జ్యూస్ తీసుకోవడం వల్ల ఇందులోని ఫైబర్ పొట్టలోని కొవ్వును కరిగించడంలో సహాయ పడుతుంది. అంతే కాక ఇందులోని విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది.

➡ పుచ్చకాయ జ్యూస్...

పుచ్చకాయ జ్యూస్‌ని తరచూ తీసుకోవడం మంచిది. ఎందుకంటే ఇందులో నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల తొందరగా పొట్ట నిండిన భావన కలుగుతుంది. దీనితో తినాలనే కోరిక తగ్గి, తొందరగా బరువు తగ్గవచ్చు.

➡ నిమ్మ జూస్

నిమ్మరసం తేనె కలిపి తాగుతూ వుంటే తొందరగా పొట్ట నిండిన భావన కలిగిస్తుంది. దీనితో తినాలనే కోరిక తగ్గి, తొందరగా బరువు తగ్గచ్చు.

సినిమా


● అల్లు అర్జున్

ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో 'యాస'ల ట్రెండ్ నడుస్తోంది. పాత్రలకు తగ్గట్టు స్టార్స్ ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల యాసలు పలకడానికి 'యస్' చెబుతున్నారు. ఏ యాసకి ఆ యాస ఆడియన్స్‌ని థియేటర్స్‌కి రప్పించడానికి ఉపయోగపడుతోంది. అందుకే 'యాసలందు అన్ని యాసలూ లెస్స' అని చెప్పాలి. ప్రస్తుతం 'పుష్ప 2, హరోం హర'తో పాటు విశ్వక్ సేన్ చిత్రం, అనన్య నాగళ్ల మూవీ వంటి పలు సినిమాలు ఆయా ప్రాంత యాసల నేపథ్యంలో రూపొందుతున్నాయి.. వాటిపై ఓ లుక్కేద్దాం.

యాసలందు అన్ని యాసలూ లెస్స


● విశ్వక్ సేన్


● సుధీర్‌బాబు

పుష్పగాడి రూలు

'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైరు'... 'తగ్గేదే లే' అంటూ 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో హీరో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్ ఎంత పాపులర్ అయిందో చెప్పక్కర్లేదు. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో హిట్ అయింది. ఈ చిత్రంలో హీరో, హీరోయిన్ సహా దాదాపు అన్ని పాత్రలు రాయలసీమలోని చిత్తూరు యాసలో మాట్లాడతాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప 2: ది రూల్' కూడా చిత్తూరు యాసలో రూపొందుతోంది. అల్లు అర్జున్, రష్మికా మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇక 'అడవిలో జంతువులు రెండడుగులు ఎనక్కి ఏసినాయంటే పులి వచ్చుండాదని అర్థం.. అదే పులి రెండడుగులు ఎనక్కి ఏసినాదంటే పుష్ప వచ్చుండాడని అర్థం', 'పుష్పగాడి రూలు' వంటి డైలాగులు 'పుష్ప 2: ది రూల్' గ్లింప్స్‌లో ఉన్నాయి.

ఇంగ సెప్పేదేం లేదు.. సేసేదే

సుధీర్‌బాబు హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'హరోం హర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన 1989 నాటి కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా టీజర్‌లో 'సుబ్రహ్మణ్యం అన్న.. జనాలు నీ కోసం సూస్తా ఉండారు.. అట్లా కదలకుండా ఉంటే ఎట్లా.. ఏందోకటి సెప్పు', 'ఇంగ సెప్పేదేం లేదు.. సేసేదే' వంటి చిత్తూరు యాస డైలాగులు వినిపించాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా డిసెంబర్ 22న విడుదల కానుంది

బ్లాక్.. వైట్ ఉండదు..

'సామాజిక నిబంధనలను ధిక్కరించే ప్రపంచంలో బ్లాక్ ఉండదు, వైట్ ఉండదు, గ్రే మాత్రమే ఉంటుంది' అంటూ 'వీఎస్ 11' (వర్కింగ్ టైటిల్) చిత్రం వీడియో రిలీజ్ అయింది. విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని చీకటి సామ్రాజ్యం నేపథ్యంలో పీరియాడిక్ చిత్రంగా ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో విశ్వక్ సేన్ గోదావరి యాసలో మాట్లాడతారు.


● అనన్య నాగళ్ల

శ్రీకాకుళం యాసతో...

అనన్య నాగళ్ల, రవి మహాదాస్యం జంటగా 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో రాజా రామ్మోహన్ చల్లా దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. బేబీ లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కథాంశం శ్రీకాకుళం యాస నేపథ్యంలో సాగుతుంది.


● అక్షా ఖాన్

నెల్లూరి నెరజాణ

డైరెక్టర్ నాగ్ అశ్విన్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన చిగురుపాటి సుబ్రమణ్యం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'నెల్లూరి నెరజాణ'. ఎంఎస్ చంద్ర, హరి హీరోలుగా, అక్షా ఖాన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం పక్కా నెల్లూరు యాసలో రూపొందినట్లు చిగురుపాటి సుబ్రమణ్యం తెలిపారు.

ఇవే కాదు.. మరికొన్ని చిత్రాల్లో కూడా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ యాస వినిపించనుంది.

ఇది మరచిపోలేని అనుభూతి - రామ్‌చరణ్


● రామ్‌చరణ్, ఉపాసన

"ఫస్ట్ టైమ్ పాపను ఎత్తుకున్నప్పుడు ఏ తండ్రికైనా ఎంత ఆనందంగా ఉంటుందో నాకూ అలానే అనిపించింది. ఇది మరచిపోలేని అనుభూతి. ఉపాసన, పాప క్షేమంగా ఉన్నారు" అని రామ్‌చరణ్ అన్నారు. రామ్‌చరణ్ భార్య ఉపాసన హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో ఈ నెల 20న ఒక పాపకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉపాసన డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాసన, పాపతో కలిసి రామ్‌చరణ్ మీడియా ముందుకు వచ్చారు. పాప ఎవరి పోలిక అని విలేకరులు అడగ్గా.. 'కచ్చితంగా నాన్నలాగా ఉంటుంది' అన్నారు రామ్‌చరణ్. తాను, ఉపాసన పాప కోసం మంచి పేరును ఎంచుకున్నామనీ, సంప్రదాయం ప్రకారం 21వ రోజున పేరు ప్రకటిస్తామనీ చరణ్ అన్నారు.

క్వాలిటీ ఫిల్మ్‌లా అనిపిస్తోంది - మారుతి


● మీనాక్షీ చౌదరి


● చైతన్యా రావ్, మారుతి

చైతన్యా రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వంలో యష్ రంగినేని నిర్మించిన చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. ఈ సినిమా జూలై 21న రిలీజ్ కానున్న సందర్భంగా శుక్రవారం టీజర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు మారుతి మాట్లాడుతూ– "1980, 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఆ నేటివిటీ ఎక్కడా మిస్ కాకుండా ఈ సినిమాను తెరకెక్కించారు. టీజర్ చూస్తుంటే క్వాలిటీ ఫిల్మ్‌లా అనిపిస్తోంది" అన్నారు. "ఇప్పుడొస్తున్న చిత్రాలతో పోలిస్తే మా చిత్రం భిన్నంగా ఉంటుంది" అన్నారు చెందు ముద్దు.

మహేశ్‌కు జోడీగా...?


'గుంటూరు కారం' సినిమాలో హీరోయిన్ మీనాక్షీ చౌదరి నటించనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. కథ రీత్యా ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్స్‌కు చాన్స్ ఉంది. పూజా హెగ్డే, శ్రీలీలను ఎంపిక చేశారు. అయితే డేట్స్ సర్దుబాటు చేయలేక ఈ సినిమా నుంచి తప్పుకున్నారు పూజా హెగ్డే. దీంతో పూజా ప్లేస్‌లోకి మరో హీరోయిన్‌ను ఎంపిక చేసే పనిలో పడింది టీమ్. ఈ నేపథ్యంలో తాజాగా మీనాక్షీ చౌదరి పేరు వినిపిస్తోంది. రవితేజ 'ఖిలాడి', అడివి శేష్ 'హిట్ 2' వంటి సినిమాలతో మీనాక్షీ చౌదరి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ప్రస్తుతం విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఓ చిత్రంలో ఈ బ్యూటీ నటిస్తున్నారు. మరి.. 'గుంటూరు కారం'లో మహేశ్‌కు జోడీగా నటించే బంపర్ ఆఫర్‌ని మీనాక్షీ కొట్టేస్తారా? చూడాలి.

పిల్లి బొమ్మ వస్తుంది!


● సుధాకర్

'నెక్స్ట్ టెన్ డేస్‌లో చాలా పెద్ద డీల్ ఉంది. దుబాయ్ నుంచి ముంబైకి ఒక పిల్లి బొమ్మ వస్తుంది. దాన్ని చాలా సేఫ్‌గా మన దగ్గరకు చేర్చాలి' అనే డైలాగ్‌తో 'నారాయణ అండ్ కో' సినిమా ట్రైలర్ విడుదలైంది. సుధాకర్ కోమాకుల హీరోగా చిన్నా పాపిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి ఫిల్మ్ ప్రొడక్షన్స్, సుఖ మీడియా బ్యానర్‌లపై పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో విశ్వక్ సేన్ రిలీజ్ చేశారు "చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నారాయణ అండ్ కో' రూపొందింది" అని చిత్రయూనిట్ పేర్కొంది.

కాస్త ముందుగానే..


● రామ్

రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీ లీల నాయిక. జీ స్టూడియోస్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబరు 20న రిలీజ్ చేయాలనుకున్నారు. తాజాగా సెప్టెంబరు 15న రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇలా అనుకున్న టైమ్‌కంటే ముందుగానే ఈ సినిమా థియేటర్స్‌లోకి రానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది.

రైతుల నేపథ్యంలో...


● మోహనకృష్ణ, సుమన్

మోహన కృష్ణ, సౌజన్య, హరిణి రెడ్డి హీరో హీరోయిన్లుగా, ఓ ప్రధాన పాత్రలో సుమన్ నటించిన చిత్రం 'మోహన్‌కృష్ణ గ్యాంగ్ లీడర్'. శ్రీ లక్ష్మణ్ దర్శకత్వంలో సింగూలూరి మోహన్‌రావు నిర్మించిన ఈ చిత్రం జూలై 7న రిలీజ్ కానుంది. ఈ చిత్రం విలేకర్ల సమావేశంలో సుమన్ మాట్లాడుతూ– "రైతులను ఇబ్బంది పెడుతున్న ఓ బర్నింగ్ ఇష్యూపై నా పాత్ర ఉంటుంది" అన్నారు. "రైతులు, స్నేహం, రాజకీయం.. అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది" అన్నారు మోహన కృష్ణ. "రైతు గురించి మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశాం" అన్నారు శ్రీ లక్ష్మణ్.

త్వరలో ఎస్కేప్


● శ్రుతీ పులారి

ఒకే ఒక్క పాత్రతో బాణాల క్రియేటీవ్ వర్క్స్ బ్యానర్ పై శ్రీధర్ బాణాల దర్శకత్వం వహించిన చిత్రం 'ఎస్కేప్'. శ్రుతీ పులారి హీరోయిన్‌గా నటించారు. "ఈ చిత్రానికి ఉత్తమ కథ, నటి, చిత్రం, సంగీతదర్శకుడు, దర్శకుడు, ఛాయాగ్రాహకుడు, గాయని, కాస్ట్యూమ్ డిజైనర్.. ఇలా దాదాపు 30 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కాయి" అని చిత్రయూనిట్ పేర్కొంది. "హీరోయిన్‌గా తొలి చిత్రంలోనే సింగిల్ క్యారెక్టర్ చేయడం హ్యాపీ" అన్నారు శ్రుతి. "త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతం కుమార్ పీఏ.

శత్రువులెవరో...


● రిచా, సాయి రోనక్

ఓ ఫొటోగ్రాఫర్ తన జీవితంలో శత్రువులెవరో, మిత్రులెవరో తెలియని సందిగ్ధంలో ఉంటాడు. అప్పుడు అతనేం చేశాడు? అనేది 'సర్కిల్' చిత్రం ప్రధాన ఇతివృత్తం. సాయి రోనక్, బాబా భాస్కర్ ప్రధాన పాత్రల్లో అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా, పార్థవ సత్య కీలక పాత్రలు చేశారు. ఫొటోగ్రాఫర్‌గా సాయి రోనక్ చేశారు. నీలకంఠ దర్శకత్వంలో ఎమ్వీ శరత్ చంద్ర, టి. సుమలత, అన్విత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం జూలై 7 రిలీజ్ కానుంది.